ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024



స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగనున్న వేడుకలకు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫీవర్..ఫియర్



సిరిసిల్ల జిల్లా ప్రధాన అసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న బాలుడు

- జిల్లాలో జ్వరాల పంజా
- 45 రోజుల్లో 14 డెంగ్యూ కేసులు
- డెంగ్యూతో ఒకరి మృతి
- జిల్లాలో 23 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు
- ఇంటింటా కొనసాగుతున్న ఫీవర్ సర్వే
- ఇప్పటి వరకు 3 వేలకు పైగా జ్వరం కేసులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. వైరల్ జ్వరాలకు తోడుగా డెంగ్యూ జ్వరాలతో జనం భయాందోళనకు గురవుతున్నారు. డెంగ్యూ లక్షణాలతో వస్తున్న జ్వరాలకు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో సామాన్య ప్రజలు ఖరీదైన చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రులు కిటకిటలాడుతుండగా 45 రోజుల్లో 14 డెంగ్యూ కేసులు జిల్లాలో నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలోని మెహెర్ నగర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ నడుపుతూ ఉపాధి పొందుతున్న జూపల్లి సంపత్‌రావు (42) డెంగ్యూ జ్వరానికి గురై హైదరాబాద్‌లో ఒక కార్పొరేట్ అసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెం దాడు. ఇప్పటికే జిల్లాలో డెంగ్యూ భయం వెంటాడుతుండగా ఒకరు మృతిచెందడంతో ప్రజల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేవలం ప్రభుత్వ అసుపత్రులకు చికిత్స కోసం వచ్చిన వారిలో డెంగ్యూ కేసులు మాత్రమే లెక్కలోకి వస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి కేసులు నమోదు కావ డం లేదు. డెంగ్యూ లక్షణాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలతో ప్రైవేటు ఆసుపత్రులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా చికిత్స పొందుతున్నారు. నిత్యం 150 నుంచి 300 మంది వరకు అసుపత్రులకు చికిత్స కోసం వెళ్తున్నారు. పిల్లలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.



సిరిసిల్ల జిల్లా ప్రధాన అసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న పిల్లలు

● యేటా పెరుగుతున్న డెంగ్యూ కేసులు

జిల్లాలో ప్రతియేటా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు వేములవాడ ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ లక్షణాల జ్వరాలతో చికిత్సలు పొందుతు న్నారు. 2021లో 127 మంది డెంగ్యూ బారినపడ్డారు. 2022లో 50 మంది, 2023లో 20 మంది, ఈ సంవత్సరం జనవరి నుంచి 18 మంది డెంగ్యూ బారిన పడ్డారు. డెంగ్యూ నివారణ, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డ్రైడే కార్యక్రమా లను నిర్వహిస్తోంది. ప్రతి వారంలో మంగళ, శుక్ర రెండు రోజులు డ్రైడే పాటిస్తున్నారు. జిల్లాలో హైరిస్క్ ప్రాం తాలుగా 17 గ్రామాలను గుర్తించారు. వేములవాడ మండ లంలో అనుపురం, నాం పల్లి, శాత్రాజుపల్లి, బోయినపల్లి మండలం గుండన్నపల్లి, కోన రావుపేట మండలం కన గర్తి, ఎల్లారెడ్డి పేట మండలం కంచర్ల, ఎల్లారెడ్డిపేట, హరిదా స్‌నగర్, వీర్నపల్లి మండలం రంగంపేట, ఇల్లంతకుంట మం డలం వల్లం పట్ల, తాళ్లపల్లి, అర్‌అండ్‌అర్ కాలనీ, చీర్ల వంచ, లక్ష్మీపూర్, ముస్తాబాద్ మండలం కొండా పూర్, తంగళ్లపల్లి మండలం తంగళ్ల పల్లి, మండెపల్లి, సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధి లో చంద్రంపేట, రెడ్డివాడ, పద్మనగర్, శాంతి నగర్, వేముల వాడ మున్సిపాలిటీలో సాయి నగర్, విద్యానగర్, భగవంతరావునగర్‌లను హైరిస్క్ ప్రాంతా లుగా గుర్తించి వైద్య అరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది.

జిల్లాలో ఇంటింటా సర్వేలో నమోదైన జ్వర పీడితులు

అరోగ్య కేంద్రం	జూలై31 వరకు	ఆగస్టు 13 వరకు
జిల్లా ఆసుపత్రి	720	367
ఎబీనగర్ (సిరిసిల్ల)	44	24
పీఎస్‌నగర్ (సిరిసిల్ల)	68	34
బోయినపల్లి	61	23
చందుర్తి	36	15
చీర్లవంచ	56	20
ఇల్లంతకుంట	59	31
గంభీరావుపేట	121	65
కొదురుపాక	74	41
కోనరావుపేట	74	30
నేరేళ్ల	17	19
పోత్గల్	38	15
తంగళ్లపల్లి	79	31
వేములవాడ	217	91
విలాసాగర్	44	20
ఎల్లారెడ్డిపేట	310	187
హన్మాజిపేట	66	26
లింగన్నపేట	34	30
మొత్తం	2,118	1,059

● ఇంటింటా జ్వర సర్వే



సిరిసిల్లలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైరల్ జ్వరాలను అరికట్టే దిశగా ముందుగానే సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, ఇతర జ్వరాలను గుర్తించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వేను కొనసాగిస్తోంది. ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఆర్పీలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. దోమకాటుతో వచ్చే డెంగ్యూ, మలేరియా చికెన్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వివరాలను సేకరిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు లాంటి సమస్యలు ఉంటే చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో ఫీవర్ సర్వేలో గత నెలలో 2,118 మంది జ్వర పీడితులను గుర్తించారు. 8 మంది డెంగ్యూ కేసులు వచ్చాయి. ఈ నెల 13వ తేదీ వరకు 1,059మంది జ్వర పీడితులను గుర్తించగా ఆరు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి.

డెంగ్యూ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సిరిసిల్లలో పీఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డెంగ్యూ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఎస్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంతమంది రోగులు కేంద్రానికి వస్తున్నారు. వైద్యం ఎలా అందిస్తున్నారు. టీ హబ్‌కు పంపిస్తున్న శాంపిల్స్, వైరల్ జ్వరాలు, డెంగ్యూ కేసులపై కలెక్టర్ ఆరాతీశారు. ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన సేవలను పారదర్శకంగా అందించాలని అన్నారు. వైద్య సేవలు అందించడంతో అలసత్వం ప్రదర్శించవద్దని వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ఏఎన్‌సీ చెకప్‌లు చేయించాలని అన్నారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న ఉన్నారు.

ఆహార సలహా సంఘాల ఏర్పాట్లు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ రావడంతో ఆహార సలహా సంఘాల సమావేశాలు ఏర్పాటు చేయలేదని తొందరలోనే ఆహార సలహా సంఘాలు జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మండల స్థాయిలో కమిటీ లు ఏర్పాటు చేసుకుని సమావేశాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తామ ని జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆహార నాణ్యతపై నిఘా ఏదీ' అనే కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలో పేదలకు అందించే రేషన్ బియ్యం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్య మైన ప్రమాణాలతో బియ్యం అందించే విధంగా గోదాం ఇంచార్జ్‌లకు అదేశా లు ఇచ్చినట్లు తెలిపారు. లోపాలు ఉంటే తన దృష్టి తీసుకురావాలని కోరారు.

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, ఆగస్టు 13: ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని మధ్యాహ్నభోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేప ట్టారు. మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కుదిగారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బెజగం సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విభాగాల్లో బదిలీలు చేపట్టి కేవలం ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు చేయలేద న్నారు. కోర్టులో కేసు త్వరగా పరిష్కారం అయ్యేందుకు ప్రభుత్వం కృషిచేయ డంతో పాటు 010ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న హైద్రాబాద్‌లోని ధర్నాచౌక్‌లో జరిగే నిరాహారదీక్షలో ఎక్కువ మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధూ కర్, ఉపాధ్యాయులు వెంకన్న, వేణు, మురళీకృష్ణ, చిత్తనూరి వెంకన్న, రాజు, రోజారమణి, సాంబయ్య, విజయ్, అంజయ్య, కిరణ్, బాబు, మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : డీఈవో

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో ఏ విధమైన సమస్యలు వచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వస్తే పరిష్కరిస్తామని జిల్లా విద్యాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'గురుకులాల్లో సమస్యలతో సతమతం' కథనానికి స్పందించారు. పాఠశాలల్లో సౌకర్యాలకు సంబంధించిన మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటాం



పిలుపు పత్రికను ఆవిష్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్ సభ్యులు

గంభీరావుపేట, ఆగస్ట్ 13: నిరాదరణకు గురవుతున్న సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం తెలంగాణ ఆల్ సీని యర్ సిటిజన్ అసోసియేషన్ గంభీరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో సీని యర్ సిటిజన్ పిలుపు పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం 2007లో బలమైన చట్టం రూపొందించినా అవగాహన లేకపోవడంతో అక్కడక్కడ తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారని అన్నా రు. తల్లిదండ్రులకు వేధింపులు జరిగిన చోట కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. తల్లిదండ్రులను పోషించని పిల్లల పట్ల చట్టప్రకారం ముందుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ బారధన్ రాజు, జోగన్నగారి రాజనర్సయ్య, చిట్టంపల్లి రాజయ్య, మందుల సిద్దిరాము లు, మహంకాళి నరసయ్య, దుద్దినపల్లి హన్మండ్లు, సుతారి సత్తయ్య, లక్ష్మి రెడ్డి సత్యంరెడ్డి, ఈరబోయిన శివయ్య, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

బద్దనపల్లి గురుకుల పాఠశాలను సందర్శించిన బీజేపీ నాయకులు

తంగళ్లపల్లి, ఆగస్టు 13: పారిశుద్య నిర్వహణ, వంట గది సరిగా లేదని బీజేపీ శ్రేణులు ఆరోపించారు. మంగళ వారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి బాలికల గురు కుల పాఠశాల, కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, కిచెన్‌తో పాటు హాస్టల్ గదులు, తరగతి గదులను సందర్శించినట్లు తెలిపారు. ఎక్కడి చెత్త అక్కడే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. పారిశుద్య నిర్వహణ సక్రమంగా లేదని అలాగే పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. గురుకుల కళాశాల, పాఠశాలలోని సమస్యలు, నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గురుకులంలోని సమస్యలను అధికారులు పరిష్కరిం చాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి కాళీచరణ్, ఉపాధ్యక్షుడు ఇటికల రాజు, ఇటికల మహేందర్‌లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట ధర్నా



వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని కోరుతూ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళనలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు, పెరిగిన వేతనాలు, అందించాలని ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం, ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల బ్యాంక్ రుణాలు అందిం చాలని కోరారు. వంట సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందించాలని, డ్రెస్‌కోడ్, ఆరోగ్య బీమా, రూ. 5 లక్షల వరకు వైద్య సహాయ ఖర్చులు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వాగ్దానం చేసిందని తెలిపారు. ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అధికారులు వేధింపులు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, మధ్యాహ్న భోజన విభాగం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్, సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, కార్మికులు అశోక్, నర్సయ్య, యశోదారెడ్డి, బాబాయ్, నర్సవ్వ రాధ, లక్ష్మీ, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ రుణాల్లో తీవ్రమైన వేధింపులు

- ఐద్వా జిల్లా కార్యదర్శి విమల

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ రుణాలు తీసుకున్న ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తూ తీవ్రమైన వేధింపులకు గురిచేస్తు న్నారని అఖిలభారత ప్రజాతంత్ర జిల్లా కార్యదర్శి విమల అన్నారు. మంగళవారం సిరిసిల్ల సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు బందన్, స్పందన, బ్యాంక్ లాంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలపై ఐద్వా ద్వారా సర్వే నిర్వహిం చినట్లు తెలిపారు. సర్వేలో కార్మికులకు పనిలేక పోవడంతో డబ్బులు చెల్లించ లేక ఇబ్బందులు పడుతున్నారని ఫైనాన్స్ నిర్వాహకులు తీవ్రంగా వేధిస్తున్న ట్లు తేలిందన్నారు. ఇంట్లోని వస్తువులను అమ్ముకుని అప్పులు చెల్లిస్తున్నారని మైక్రోఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సూరం పద్మ, కోడం లలిత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల రక్షణ న్యాయవాదుల బాధ్యత

● కోర్టు ఉత్తర్వులను పోలీసులు ధిక్కరించడంపై నిరసన ● న్యాయవాదుల రిలే దీక్షలు ప్రారంభం



సిరిసిల్లలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 13: పౌరహక్కుల రక్షణ న్యాయవాదుల బాధ్యత అని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జోర్నాల సంజీవరెడ్డి అన్నారు. కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వుల అమలులో పోలీసుల తీరును నిరసిస్తూ న్యాయవాదులు మంగళవారం చేపట్టిన రిలేనిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ కోర్టుల ఇంజక్షన్ ఉత్తర్వులను ధిక్కరిం చడమే కాకుండా న్యాయవాదులపై, కక్షిదారులపై అక్రమ కేసులను బనాయి స్తున్న పోలీసుల తీరు సరైంది కాదన్నారు. ఇందుకు నిరసనగా సిరిసిల్ల, వేముల వాడ కోర్టులలో న్యాయవాదులు గత 13రోజులుగా కోర్టు విధులు బహిష్కరి స్తున్నారన్నారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ కక్షిదారుల హక్కులు కాపాడేందుకు కోర్టులలో ఇంజక్షన్ ఆర్డర్ ఇప్పించినప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా తిరిగి వారిపైనే పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయా లని, కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రిలే నిరాహారదీక్షలో కూర్చున్న న్యాయవాదులు బోంపెల్లి రవీందర్‌రావు, తంగళ్లపల్లి వెంకటి, కట్కం జనార్దన్, గుండెల్లి శశాంకం, కంసాని రాజేశ్, శుష్మ, నిషాదలకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉమాశంకర్, వసంతం, నాగుల సత్యనా రాయణ, తిరుమలగౌడ్, ధర్మేందర్, గోవిందు భాస్కర్, రమాకాంతరావు, కోడం సురేష్, వేణు, శ్రీనివాస్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట, ఆగస్టు 13: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నగదు రహిత లావాదేవీలపై మంగళవారం విద్యార్థులకు అవగా హన కల్పించారు. సొసైటీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ సైబర్ ఆర్థిక నేరాలపై వివిధ అంశాలను వివరించారు. ఫిషింగ్ కాల్స్ రావడం, అన్‌లైన్ మార్కెటింగ్, క్రెడిట్ కార్డులు అంటూ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. స్కీన్ షేరింగ్ యాప్ ద్వారా సిమ్ కార్డులను, ఇంటర్ నెట్, క్యూఆర్ కోడ్, సామాజిక మాధ్యమాల ద్వారా మనకు తెలిసిన వ్యక్తులుగా నటించి ఈమెయిల్, మేసేజ్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే పాల్పడితే 1930కు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాణి, ప్రభా కర్, ధర్మపురి అంజనేయులు, శ్రావణ్, అది, విష్ణు, భిక్షమ య్య తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా ర్యాలీ



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడులను నిరసిస్తూ వేములవాడలో బీజేపీ నాయకులు మంగళవారం సాయం త్రం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు నేతృత్వంలో స్థానిక అంబేద్క ర్ కూడలి నుంచి తెలంగాణ చౌక్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న నాయకులు బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు. మతం పేరుతో విభజించ బడ్డ దేశాలలో మైనారిటీలుగా ఉన్న హిందువుల బతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని, బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు దేశ జనాభాలో 22 శాతం ఉన్న హిందువులు నేడు కేవలం ఆరు శాతానికి పరిమితం అవడం గమనిస్తే అక్కడ ఏ స్థాయిలో అకృత్యాలు జరుగుతున్నాయో అర్థం అవుతుందని అన్నారు. కేవలం మతం కారణంగా హిందువుల మానప్రాణాలు, ఆస్తులు దోచుకోవడం అత్యంత బాధాకరం అన్నారు.

మన దేశంలోని కుహనా లౌకికవాదులు బంగ్లాదేశ్‌లో హిందువు లపై జరుగుతున్న దాడులను ఖండించే సాహసం చేయడం లేదని, దేశంలోని ప్రతి హిందువు బంగ్లాదేశ్‌లోని హిందువులకు అండగా నిలబ డేందుకు ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, పిన్నింటి హనుమం డ్లు, మైలారం శ్రీనివాస్, మెరుగు లక్ష్మణ్, జింక అనిల్, నామాల శేఖర్, బిళ్ళ కృష్ణ, వావిలాల నర్సయ్య, జవ్వాజి రాజశేఖర్, కోరెపు నరేష్, రేగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: ఒంటిరితనంతో పాటు అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధుడు కొప్పు శంకర్ (72) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన శంకర్ తన భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. భార్యాపిల్లలతో గొడవ పడి 20 ఏళ్ల కిందట శంకర్ తన స్వగ్రామానికి వచ్చి చిన్నపాటి రేకుల షెడ్డులో ఒంటరిగా జీవిస్తున్నాడు. గ్రామంలో పశువుల కాపరిగా కొనసాగుతుండేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన శంకర్ ఒంటరితనం, అనారోగ్యం వల్ల మనస్తాపం చెంది రేకుల షెడ్డులో ఉరివేసుకుని చనిపోయాడు. ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య హన్మవ్వ గ్రామానికి చేరుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.



వేణుగోపాల్ రెడ్డి

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి ఆహ్వానం

వీణవంక, ఆగస్టు 13: న్యూఢిల్లీలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనాలని మండలంలోని ఘన్ముక్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పదో తరగతి విద్యార్థి బావు శ్రీశాంత్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదుగురు విద్యార్థులకు అవకాశం దక్కింది. వీరు మూడు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించి కేంద్ర విద్యాశాఖ మంత్రితో సమావేశంలో పాల్గొంటారు. ఎంపికైన వారిని మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్, డీఈవో జనార్దన్‌రావు అభినందించారు.



బావు శ్రీశాంత్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఆగస్టు 13: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ చెవుల అనిల్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 13: అప్పులు తీర్చే మార్గం లేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై పృథ్వీదర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కాపురం రాజయ్య (60) తన ఇద్దరు కుమారులను ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపించాడు. వారిద్దరూ అక్కడ సరైన జీతం లేకపోవడంతో ఇంటికి వచ్చారు. అంతే కాకుండా రాజయ్య కుమార్తె వివాహానికి అప్పు చేశాడు. గల్ఫ్ అప్పులు, కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు పెరగడంతో రాజయ్య తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులో ఉన్న కొండపోచమ్మ వద్ద ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, ఆగస్టు13: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆర్టీసీ అదనపు బస్సులు నడిపించనున్నట్లు ఆర్‌ఎం ఎస్.సుచరిత అన్నారు. మంగళవారం కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు, ఈనెల 19న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు ఈనెల 14న 83 బస్సులు, 16న 58 బస్సులు, 17న 145 బస్సులు మొత్తం 286 బస్సులు నడిపించనున్నామన్నారు. కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 19న 150 బస్సులు, 20న 150 బస్సులు, 21న 140 బస్సులు మొత్తం 440 బస్సులు కలుపుకుని మొత్తం 726 బస్సులు నడిపించేందకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్స్ (మెకానికల్, ఆపరేషన్స్) కె.సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై కుక్క దాడి

చందుర్తి, ఆగస్టు 13 : అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కటకం హరిత తన కుమారుడైన ఆరుష్‌ను మంగళవారం ఉదయం అంగన్‌వాడీకి పంపించింది. ఆరుష్‌తో పాటు మరో బాలుడిని మూత్ర విసర్జన కోసం ఆయా లచ్చవ్వ మూత్రశాల వద్దకు తీసుకువెళ్లింది. బాలుడు మూత్రశాల డోర్ తీసి లోపలికి వెళ్లగానే, అందులోనే ఉన్న కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. ఈ సంఘటనలో బాలుడి చెవి భాగంలో తీవ్ర గాయమైంది. బాలుడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అంగన్‌వాడీలో కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

గూడెంలో చిన్నారులపై..

ఓదెల: మండలంలోని గూడెంలో మంగళవారం కుక్కల గుంపు స్వైర విహారం చేసి పలువురిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో రేగుల ఈశ్వర్ ప్రసాద్, రేగుల వినయ్ అనే చిన్నారుల పొట్టల్లో, చేతులకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి కూడా ఇళ్లలో నుంచి బయటికి వచ్చిన పలువురిపై కుక్కల గుంపు ఆకస్మాత్తుగా దాడి చేసి మరో అయిదుగురు వ్యక్తులను నోట కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్థులు రాత్రింబవళ్లు బయటకు రావాలంటే భయందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టి, గాయాలకు గురైన వారికి గ్రామంలోని వైద్య చికిత్సలు అందించాలని కోరారు.



చెవికి గాయంతో బాలుడు

కథలాపూర్‌లో టెలికాం కేబుల్ చోరీ

కథలాపూర్, ఆగస్టు 13 : మండల కేంద్రంలో మంగళవారం టెలికాం శాఖకు చెందిన కేబుల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వరద కాలువ పక్కన నుంచి గతంలో భూష ణరావుపేటకు టెలిఫోన్ సదుపాయం కల్పించేందుకు ఈ కేబుల్ వేశారు. అయితే సుమారుజీ ఐదుగురు వ్యక్తులు తాము టెలికాం విభాగానికి చెందిన వారమని పేర్కొంటూ కేబుల్ కోసుకు వెళ్లారు. ఈ క్రమంలో అటువైపు వెళ్లే పలువురు రైతులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు సంబంధిత అధికారులకు సమాచారం అందించగా ఎస్‌డీఈ చిన్నయ్య, జేటీవో అశోక్‌కుమార్, లైన్‌మెన్ సంఘటనా స్థలంకు చేరుకున్నారు. వరద కాలువ వెంబడి కోసిన కేబుల్‌ను దాచి ఉంచినట్టు కనిపెట్టారు. సుమారు వంద మీటర్ల మేర రూ. 60 వేల విలువైన కేబుల్ కోసి వేసినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. పోలీసులు కేబుల్‌ను చోరీ చేసిన దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బకాయిలు వసూళ్లపై దృష్టి సారించాలి

రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం



సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాహనదారుల నుంచి రావాల్సిన పన్నుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం సూచించారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించే విధంగా వాహన దారులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిలో యువకులే ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రమాదాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో ఉన్న కార్యాలయం అనువుగా లేదని వాహనాదారులు తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలతో ఉండే భవనంలోకి మారుస్తామని తెలిపారు. తనిఖీల్లో జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య



రాజేందర్(ఫైల్)

మెట్‌పల్లి , ఆగస్టు 13 (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో మంగవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన బాలి రాజేందర్(48) అనే వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్ బోధన్ పట్టణంలో 11 సంవత్సరాలుగా సిమెంట్, ఇనుము వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం బోధన్ నుంచి కోరుట్లలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి కావడంతో ఇంటికి వెళ్లలేక పట్టణంలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నాడు.

మంగళవారం ఉదయం 3 గంటల సమ యంలో ఓ వాట్సప్ గ్రూప్‌లో, తన భార్య శిరీషకు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ పంపాడు. అప్రమత్తమైన కు టుంబ సభ్యులు, స్నేహితులు 100 కాల్‌తో పాటు మెట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు లాడ్జికి వెళ్లి చూసేసరికి రాజేందర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజేందర్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే తనను ఇద్దరు మోసం చేశారని, 15 సంవత్సరాలుగా డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆ ఇద్దరి వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని ఇద్దరు పేర్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అదే విధంగా పలు యాప్‌లలో భార్యకు తెలియకుండా లోన్లు తీసుకున్నాడని వాటి ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తన కూతురు, కొడుకును స్నేహితులు ఆదుకుని ఉన్నత చదువులకు సహకారం అందించాలని అందులో కోరాడు. వ్యాపారి రాజేందర్‌ది స్వస్థలం మల్లాపూర్ మండలం మొగిలిపేట కాగా 15 ఏళ్ల క్రితమే బోధన్ వెళ్లి అక్కడే స్థిరపడినట్లు స్నేహితులు తెలి పారు. భార్య శిరిష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మృతుడికి ఎంత అప్పు ఉన్నాదనేది పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 13: రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి 17వ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 3,150 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.79 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.20 టీఎంసీలు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

డెంగ్యూతో వ్యక్తి మృతి



సంపత్‌రావు (ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్‌కు చెందిన వాటర్ ప్లాంట్ యజమాని జూపల్లి సంపత్‌రావు (42) మంగళవారం డెంగ్యూతో మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన సంపత్‌రావు దాదాపు 23 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం సిరిసిల్ల పట్టణం వచ్చి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. మెహర్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం తీవ్ర జ్వరం రావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా డెంగ్యూ అని తేలింది. ప్లేట్‌లెట్స్ చాలా వరకు తగ్గిపోవడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

గంభీరావుపేట, ఆగస్టు 13: మండల కేంద్రానికి సమీపాన రైస్‌మిల్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మల్లారెడ్డిపేటకు చెందిన కందుకుల నవీన్, నర్మాలకు చెందిన ద్యానబోయిన సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. మల్లారెడ్డిపేట నుంచి నవీన్ గంభీరావుపేట మండల కేంద్రానికి వస్తుండగా, లింగన్నపేట నుంచి మండల కేంద్రానికి వస్తున్న సురేష్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన వీరిద్దరినీ ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్

డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం

మెట్‌పల్లి , ఆగస్టు 13(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని చైతన్యనగర్‌లో మంగళవారం ఓ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపడింది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన డ్రైవర్ చైతన్య నగర్ ప్రధాన వీధి గుండా వెళ్తుండగా డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్‌కు హఠాత్తుగా ఫిట్స్ రావాడంతో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం సగ భాగం విరిగి ట్రాక్టర్‌పై పడింది. గమ ణించిన స్థానికు లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫర నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్‌ను స్థానికులు ప్రథమ చికిత్స అందించడంతో ప్రాణాలతో బయట పడ్డాడు.

గురుకుల పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

అసౌకర్యాలపై ఆరుగంటలు పరిశీలన



గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, వంటశాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 13: సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని ఇప్పలపల్లి మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో హైదారాబాద్ ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న అసౌకర్యాలపై ఏకకాలంలో ఏసీబీ, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఇప్పలపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో దాదాపు 6 గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. అద్దెభవనంలో ఉన్న ఈ పాఠశాలలో పరిశుభ్రత, ఆహారం, 356మంది విద్యార్థులకు సరిపడా సదుపాయాలను, హాస్టల్‌లో రికార్డులు పరిశీలించారు. వంటశాలలో ఆహార నిల్వలు, తయారీ, నిర్వహణ, రికార్డుల ప్రకారం విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలలోని 19 మంది అధ్యాపకులు విద్యార్థులతో ఎలా ఉంటున్నారని ఆరా తీశారు. కాంట్రాక్టరు ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న స్థితిగతులపై అధ్యయనం చేసి రాష్ట్ర ఏసీబీ డీజీకి నివేదిక సమర్పిస్తామని ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్య నారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారిణి భూలక్ష్మి, ఆడిటర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 13: స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ పెద్దపల్లి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కడారి సునీల్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ఉసి గొలుపుతున్నదని, దేశ సమగ్రతకు ఐక్యతకు భంగం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి అడ్డగోలు షరతులు కండిషన్లు పెట్టి హామీల అమలుకు అడ్డుగా చూపెటవద్దన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ రెండు లక్షల రూపాయలు పూర్తిగా తెల్లరేషన్ కార్డు లింక్ లేకుండా రైతుల పాస్‌బుక్ ఆధారంగా రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు బంధును వెంటనే అమలు చేయాలని రైతుల పెట్టుబడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెల్లరేషన్ కార్డులకు వ్యవసాయ భూములు మాగాని, చెలుక రకరకాల ఇబ్బం దులు పెట్టొద్దన్నారు. సెప్టెంబరు నెలలో జరగబోయే స్థానికసంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గోష్కి మోహన్, గౌతమ్ గోవర్ధన్, కే కనకరాజు టి మల్లయ్య కోడం స్వామి, గట్టయ్య, రాజమౌళి, పసుల మల్లారెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఓదమ్మ రమ, శంకర్, మానస్, ప్రీతం, టి లక్ష్మణ్, సీపీఐ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడ, ఆగస్టు 13: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. వేములవాడలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ, వయస్సు తప్పుపడిన అంగన్‌వాడీ సిబ్బందికి న్యాయం చేయాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి పదోన్నతులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని ఆయాలు టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కోరపు క్రాంతి, కోరపు శ్రీను, శీలం నర్సయ్య, పెంట గణేష్ తదితరలు పాల్గొన్నారు.

వర్గీకరణ విజయోత్సవ ర్యాలీకి తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తల పెట్టిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీకి ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆ సంఘం నాయకులు మంగళవారం తరలి వెళ్లారు. సుమారు 200 మంది బయలుదేరి వెళ్లారు. నాయకులు లక్ష్మణ్, శంకర్, గోపాల్, సామ్యూల్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

వీర్నపల్లి, ఆగస్టు 13: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని సెస్ ఏడీ మహేందర్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంతో కలిసి రంగంపేట గ్రామానికి చెందిన రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నెలనెలా విద్యుత్ వినియోగంపై తనిఖీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బకాయిలు లేకుండా బిల్లులు చెల్లించి రైతులు సహకరిస్తే నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈ పృథ్వీ, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి

ఇల్లంతకుంట, ఆగస్టు 13: స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలంటూ అధ్యాపకులు, విద్యార్థులు పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. మండల కేంద్రంలోని వేదశ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం తమ సమస్యలను కార్డుపై రాసి పోస్టుడబ్బాలో వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బత్తిని అంజనేయులు, అధ్యాపకులు ఏనుగుల శ్రీనివాస్, చిలుకల రమణారెడ్డి, గొర్ల సురేందర్‌యాదవ్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో 16 నుంచి మహా చండీయాగం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పద్మశాలీ ప్రతినిధులు

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో 16 నుంచి 18 వరకు జరిగే మహా చండీ యాగం ఏర్పాట్లను మంగళవారం పద్మశాలీ సంఘం ప్రతినిధులు పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, బీఆర్ఎస్ సిరిసిల్ల అధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలీ కళ్యాణ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జె తార, పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య ఉన్నారు.

విద్యార్థినులకు క్షేత్రస్థాయి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: వృత్తి శిక్షణ విద్యలో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినిలకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బ్యూటీ పార్లర్‌లో మంగళవారం క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. అందంగా అలంకరించడం, జుట్టు, గోర్లు తదితర అంశాలపై నిర్వాహకురాలు జయంతి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వృత్తి విద్య శిక్షకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సిరిసిల్లలో తిరంగా ర్యాలీ



సిరిసిల్లలో యువమోర్చా తిరంగా ర్యాలీ

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్లలోని జాతీయ పతాకాలతో వాడవాడలా ర్యాలీ చేపట్టారు. ఆగస్టు 15న ప్రతి పౌరుడు తమ ఇంటిపై మూడు రంగుల జెండాను ఎగురవేసి వందనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి , జిల్లా యువమోర్చా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా ఇంచార్జ్ శీలం రాజు, అసెంబ్లీ ఇంచార్జ్ గరిపెల్లి ప్రభాకర్, కో ఆర్డినేటర్‌లు మ్యాన రాంప్రసాద్, ఊరగొండ రాజు, అడెపు రవీందర్, శ్రీకాంత్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, వంగ అనిల్, అన్నల్‌దాస్ వేణు, చందు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రంగి, ఆగస్టు 13: రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో, ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో మంగళవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ వనిత, ఏఎన్ఎంలు విజయ, రాజేశ్వరి, వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్ రవీంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

చందుర్తి, ఆగస్టు 13: చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ తూర్పాటి శ్రీనివాస్ మంగళవారం మైక్‌సెట్‌ను అందజేశారు. తన తండ్రి తూర్పాటి లింగమయ్య జ్ఞాపకార్థం గ్రామంలో తాను చదివిన ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు అందజేసినట్లు తెలిపారు.

గంభీరావుపేటలో కళాబృందాల ప్రదర్శన

గంభీరావుపేట, ఆగస్ట 13 : గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఎడ్మల శ్రీధర్ కళాబృందాల ప్రదర్శన నిర్వహించారు. రవాణా వాహనాల త్రైమాసిక ఫీజులు, టాక్స్ బకాయిల చెల్లింపులపై వివరిస్తు గాంధీ చౌక్‌లో ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో టీం లీడర్ ఎడ్మల శ్రీధర్ రెడ్డి, కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్ ఉన్నారు.

వర్గీకరణ విజయోత్సవ ర్యాలీలో జిల్లా చిందు కళాకారులు

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎబీసీ డీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీలో పాల్గొనడానికి మంగళవారం తంగళ్లపల్లి మండలం సారంపల్లి, దేశాయిపల్లికి చెందిన చిందు కళాకారులు తరలివెళ్లారు. సికింద్రాబాద్ నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీలో చిందు కళాకారులు రాయల ప్రభాకర్, పూర్ణచందర్, గడ్డం మధుసూధన్, చంద్రమౌళి, ఓంకార్ దేవేందర్, సింహాద్రి శ్రీనివాస్, మల్లేషులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు అవగాహన

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు ఉద్యోగం సాధించాలనే కసితో చదవాలని జిల్లా అడిట్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ భవనంలో ఇంటలెక్చువల్ ఫోరం, జిల్లా గ్రంథా లయ సంస్థ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలకు క్వాలిఫై అయిన అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత తెలం గాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, లైబ్రేరియన్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

● తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 13: ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని సిఐటియు తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కులో యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన టెక్స్‌టైల్ పార్కు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కోడం రమణ మాట్లడుతూ ఒక వైపు ఉపాధి కరువై మరోవైపు బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయపై చేనేత జౌళిశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, చేనేత జౌళి శాఖ కమిషనర్‌కు సైతం విన్నివించినా పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులను రావాల్సిన యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులో యజమానులు ప్రభుత్వ ఆర్డర్లు వచ్చినప్పుడు మాత్రమే పరిశ్రమలు నడిపిస్తున్నారని అన్నారు. ఆర్డర్లు ఉంటేనే కార్మికులకు పనిదొరుకుందని లేకుంటే పనిలేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఈ నెల 16వ తేదీన ఒక్క రోజు టెక్స్‌టైల్ పార్కు బంద్ చేసి పార్కు ప్రధాన గేట్ ముందు దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. టెక్స్‌టైల్ పార్కులో పనిచేస్తున్న కార్మికులందరూ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అక్కల శ్రీనివాస్, గడ్డం రాజశేఖర్, కారంపురి మహేశ్, మేఘ ఆంజనేయులు, గోవిందు నాగయ్య, గోనె నరేష్, పులి రమేశ్, కూచన రాజేశ్, శ్రీకాంత్, సత్యనారయణ, శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్, ఆంజనేయులు, గణేశ్, రాజేంద్రప్రసాద్, సాయి, జగదీష్, కిషన్, భూమయ్య, వెంకటేశ్, నరహరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఒడిబియ్యం పోసేందుకు భక్తులకు అనుమతించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 13: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి ఒడిబియ్యం పోసేందుకు భక్తులకు అనుమతించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. రాజన్న ఆలయ ఈవో కార్యాలయంలో ఈవో వినోద్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలోని అమ్మవారికి ఒడిబియ్యం పోసేందుకు భక్తులకు అనుమతించిక, బయట అమ్మవారికి ఒడిబియ్యం పోయాలని ఆలయాధికారులు ఆంక్షలు విధించారని తెలిపారు. ఈ విషయంపై ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ అమ్మవారికి ఒడిబియ్యం పోయకుండా ఆంక్షలు విధించడం హేయమైన చర్య అన్నారు. పూర్వకాలం నుంచి అమ్మవారికి ఒడిబియ్యం పోసే కార్యక్రమం సంప్రదాయంగా కొనసాగుతుందని, ఆచార సంప్రదాయాలకు విలువనిచ్చి భక్తుల మనోభావాలను కాపాడాలని ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఈవో వినోద్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చందుర్తి, ఆగస్టు 13: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చందుర్తి ఏఎస్ఐలు బాపు, సతీష్ అన్నారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చందుర్తి ఏఎస్ఐలు బాపు, సతీష్‌లు మంగళవారం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు యుక్త వయసులో చెడు వ్యసనాల భారిన పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి చెడు వ్యసనాల వలన జీవితాలు కుటుంబాలు, బంగారం లాంటి భవిష్యత్తు కూడా పాడవుతయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, ఆగస్టు 13: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, బీఈడీ అర్హత గల ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, బోయన్నగారి నారాయణలు డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలంలో పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లడుతూ పారిశుధ్య కార్మికులను ఇవ్వడం, ఉచిత విద్యుతు అందించాడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో ఆశించిన ఫలితాలు సాధించలేమన్నారు. పదివేల పీఎస్ హెచ్‌ఎంల పోస్టులను మంజూరు చేయాలని, బదిలీ అయి రిలివ్ కానీ ఎస్జీటీలను రిలీవ్ చేయుటకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఎస్ఎస్ఏ, కేజీబీవి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఆసాని అనిల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీస రవి తదితరులు పాల్గొన్నారు.

317 జీవోతో బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ఇల్లంతకుంట: ప్రభుత్వం జారీ చేసిన 317జీవోతో బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్టీయు మండల గౌరవ అధ్యక్షుడు తూముకుంట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనంతారం, ఇల్లంతకుంట తదితర పాఠశాలలో మంగళవారం సభ్యత్వాలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎస్ హెచ్‌ఎం పోస్టులను బీఈడీ చేసిన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుర్రం సందీప్‌రెడ్డి, సంఘ నాయకులు ప్రదీప్‌రెడ్డి, మధు, వంశీధర్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. కోటి 31 లక్షలు

ఆలయ ఖజానాకు 92 గ్రాముల బంగారం, 9 కిలోల వెండి



రాజన్న ఆలయ హుండీ లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

వేములవాడ కల్చరల్, ఆగస్టు 13 : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో 33 రోజుల హుండీ ఆదాయాన్ని అత్యంత భద్రత మధ్య లెక్కించగా రూ. ఒక కోటి 31 లక్షల 19 వేల 460 నగదు సమకూరింది. 92 గ్రాముల బంగారం, 9 కిలోల 600 గ్రాముల వెండి ఆలయ ఖాజానాకు సమకూరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు సూపరిండెంట్ రాజన్‌బాబు ఏసీ సత్యనారాయణలతో పాటు శ్రీవ రామకృష్ణ భజన మండలి సేవాసమితి హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, ఆగస్టు 13 : కోనరావుపేట మండలం మల్కపేట కొత్తపల్లి గ్రామానికి చెందిన అనుముల రాజేశం అనే లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందగా ఆ కుటుంబానికి సైదా షేక్ అశోక్, సాత్విక రెడ్డి, లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు నరేష్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ప్రస్తుత సహాయం కింద రూ. 10 వేలు, 25 కిలోల బియ్యం, వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఇస్లావత్ రాజు, అరుణ్, బాస్కర్, వెంకటేష్, సృజన్, గండి నరేష్, గంగారం, నాగరాజు, మధు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.10లక్షల పరిమితి పెంచామన్నారు. పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజిరెడ్డి, బాబు, రాజేశం, రవి, బాల్‌రెడ్డి, రాజయ్య, మహేందర్, దేవయ్య, సుధాకర్, భగవంతరెడ్డి, నారాయణరెడ్డి, నర్సారెడ్డి, రాజు, బాబు, రవీందర్‌రెడ్డి, రాములు, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, రఫీక్, ఇమాం, కిష్టారెడ్డి, రాజు పాల్గొన్నారు.

రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి

● రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మంద సుదర్శన్



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సుదర్శన్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎత్తిడి తీసుకురావడం కోసం రైతులు పోరాటాలకు సిద్దం కావాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మంద సుదర్శన్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో రైతు సంఘం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు 50 శాతం పెట్టుబడిని కలపి మద్దతు ధరలు అమలు చేయాలి, రూ 500 బోనస్ ఇవ్వాలని అన్నారు. కౌలు రైతులకు కూడా రుణాలు వర్తించేల చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర అమలు చేయడం మూలంగా రైతుల ఆత్మహత్యలను, వలసలను నివారించవచ్చునన్నారు. నకిలీ ఎరువుల మందులను అమ్ముతున్న డీలర్స్‌పైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీని ప్రభుత్వం గడువులోపే అమలు చేయాలని కోరారు. అనంతరం రైతు సంఘం జిల్లా నూతన కమిటిని రాష్ట్ర నాయకుడు సుదర్శన్ సమక్షంలో సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు కోనేటి పరుశురాం, కార్యదర్శి జంగం అంజయ్య, సహాయ కార్యదర్శి ర్యాగటి కనకయ్య, కోశాధికారి దయ్యాల రామకృష్ణలను ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటీని పూలమాలలతో సన్మానించి సభ్యులు అభినందనలు తెలిపారు.

సెస్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



గంభీరావుపేట సెస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

గంభీరావుపేట, ఆగస్ట 13 : గంభీరావుపేట సెస్ కార్యాలయం వద్ద మంగళవారం లింగన్నపేట రైతులు నిరసన వ్యక్తం చేశారు. అధిక లోడ్‌తో విద్యుత్ సరాపరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి పంటలు ఎండి పోతున్నాయని రైతులు వాపోయారు. అక్రమ కనెక్షన్‌ల ద్వారనే లోడ్ అధికమై విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని ఆరోపించారు. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మలు కూడ కాలిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యకు అక్రమ విద్యుత్ కనెక్షన్‌లే కారణమని అన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్‌ల సమస్యను చాలసార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ ఈఏ అందుబాటులో ఉండటం లేదని, సెస్ ఏఈతో పాటు ఈ సమస్యను పట్టించుకోని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రైతులు మహిపాల్, నారాయణ, లింబ్యానాయక్, కైలాసం, లాల్‌సింగ్, ఇస్లావత్ రవి, పంతుల్యా, లాల్ సింగ్, మోహన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

న్యాయం చేయండి

- ఫారెస్ట్ అధికారులు పంటను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన



పాత పట్టా చూపిస్తున్న పోషవ్వ దంపతులు

కోనరావుపేట, ఆగస్టు 13: తమ భూమిలోని పత్తి పంటను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నారని న్యాయం చేయండి సార్ అని పేద దంపతులు వేడుకుంటున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గండగుల పోషవ్వ కనకయ్యలకు 20 సంవత్సరాల క్రితం 367 సర్వే నంబర్‌లో మూడు ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం పట్టా ఇచ్చిందని అన్నారు. అప్పటి నుంచి వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటున్నామని అన్నారు. మంగళవారం అటవీ శాఖ అధికారులు పత్తి మొక్కలను ధ్వంసం చేసి ఇది ఫారెస్ట్ భూమి అని అంటున్నారని బాధిత రైతులు తెలిపారు. గతంలో ఇచ్చిన పట్టా భూమిని మాకు ఇప్పించాలని కోరుతున్నారు.

చెక్కు అందజేత

కోనరావుపేట, ఆగస్టు 13 : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ సరేనా నహీంకు రూ. 7500 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరు కాగా అందజేశారు. ఈ సందర్భంగా చెక్కు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి



తపాలా సిబ్బందికి సన్మానం

వేములవాడ రూరల్, ఆగస్టు : గ్రామీణ తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని వట్టిమల్ల గ్రామంలో మంగళవారం పోస్ట్ ఆఫీస్ పథకాల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు తక్కువ ప్రీమియంతో పోస్టల్ బీమా ఎక్కువ లాభాలు ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికి ఒక పాలసీ చేసి సంపూర్ణ బీమా గ్రామంగా చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రాజును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి ఎస్పీ స్వామి, ఎం ఓ దాది మల్లేశం, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పోస్టల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రచారంలో మేము సైతం



రవాణాశాఖ ప్రచార వాహనం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 : ప్రచారంలో మేము సైతం అంటూ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ముందు కొచ్చింది. జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మన్ ఆధ్వర్యంలో ప్రచారం వాహనం ప్రారంభమైంది. సకాలంలో మీ వాహన త్రైమాసిక పన్ను బకాయిలు నిర్ణీత సమయంలో చెల్లించాలని, ఒకవేళ చెల్లించకుంటే ఆ వాహనాలు తనిఖీలో పట్టుబడితే 200 శాతం అపరాధ రుసుము విధిస్తామని ప్రచారం చేస్తున్నారు. వాహనం సీజ్ చేయపడుతుందని హెచ్చరిస్తూ ట్రాన్స్‌పోర్ట్ వాహనదారుల కోసం ప్రచార వాహనాలతో జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారంపై ప్రజలు, వాహనదారులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.